## ఏమిటీ ఈ భయం

మానవ చరిత్రను మలిచిన

మకిలి శక్తి భయం.

నెత్తురు చుక్క పనిలేకుండా

దేశాన్ని పాలించి

వ్యక్తులను నియంత్రించిన

కుటిల ఆయుధం భయం.

నెత్తురు కన్నా

మరణంకన్నా

జఠిల ఆయుధం భయం.

సైన్యాలు సైతం సాధించలేనిది,

భయం గుండా సాధించవచ్చని,

నిఖిల నికృష్ట  నాయకగణం తెలుసుకున్నాక

విరివిగా ఉపయోగించిన ఆయుధం భయం.

అధునాతన ఆయుధం

కొంత మందిని మాత్రమే నేల  కూల్చితే

భయం సకల జనులనూ నియంత్రిస్తుంది.

అది నిశ్శబ్దంగా వ్యాప్తి చెందుతుంది.

కొత్త సమస్యలు సృష్టిస్తుంది.

హింసావాదులను పుట్టిస్తుంది.

తిరుగుబాటును ప్రేరేపిస్తుంది.

మనస్సులోకి ప్రవేశిస్తుంది,

ఆలోచననూ ప్రవర్తననూ మారుస్తుంది.

విభజిస్తుంది - ఐక్యతను చెడగొడుతుంది.

బలవంతంగా లోబరచుకొంటుంది.

ఊహా శక్తిని కట్టి పడేస్తుంది.

జీవితాలను మింగేస్తుంది.

చరిత్ర భయపడిన వారిని కాదు..

భయాన్ని సవాల్ చేసిన వారిని గుర్తుంచుకొంటుంది.

గాంధీ కింగ్ భయాన్ని సవాలు చేసి ధైర్యాన్ని పుట్టించారు.

ధైర్యమే భయాన్ని చంపగలదు .

అనిశ్చితిని చంపగలదు.

*

- మీ విజయ్ చంద్ర